అర్బన్ పార్కుకు సందర్శకులను పెంచేలా చర్యలు

పార్కుకు మినీ బస్సు నడిపే ప్రతిపాదన పరిశీలించాలి

వెలుగుమట్ల అర్బన్ పార్కు పరిశీలనలో కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్

ఖమ్మం, అక్టోబర్ 23: వెలుగుమట్ల అర్బన్ పార్కుకు సందర్శకుల సంఖ్య పెంచే దిశగా వినూత్న కార్యక్రమాలు చేపట్టాలని కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ అధికారులను ఆదేశించారు. అదనపు కలెక్టర్ శ్రీజతో కలిసి బుధవారం అర్బన్ పార్కును సందర్శించిన ఆయన.. జీపులో సుమారు 4 కిలోమీటర్ల మేర పరిధి గల పార్కులో ప్రయాణించారు. గోల్డెన్ ఓరియల్ టవర్ ఎక్కి పార్కు చుట్టు పక్కల ప్రాంతాలను పరిశీలించారు. ప్రతి రోజూ ఈ పార్కుకు ఎంతమంది సందర్శకులు వస్తున్నారని, ఎంత ఆదాయం సమకూరుతోందని, పార్కు నిర్వహణకు ఎంత ఖర్చు అవుతోందని జిల్లా అటవీ అధికారిని అడిగి తెలుసుకున్నారు. పార్కులోని సౌకర్యాలను పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలల పిల్లలు ఈ పార్కును సందర్శించి ఆహ్లాదంగా గడిపేలా కార్యక్రమం తయారు చేస్తామని అన్నారు. బస్టాండ్ నుంచి వెలుగుమట్ల అర్బన్ పార్కు వరకు మినీ బస్సును నడిపే ప్రతిపాదన పరిశీలించాలని సూచించారు. కేఎంసీ కమిషనర్ అభిషేక్, ఇతర అధికారులు సిద్ధార్థ్ విక్రమ్‌సింగ్, మంజుల, నాగేశ్వర్‌రావు పాల్గొన్నారు.

కలెక్టరేట్‌లో క్రచే సెంటర్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్

చిన్నారులు ఆహ్లాదంగా గడిపేందుకు ఏర్పాట్లు

కలెక్టరేట్‌లోని ఉద్యోగుల చిన్నారులు ఆహ్లాదంగా గడిపేలా క్రచే సెంటర్‌లో పిల్లల సంరక్షణ ఏర్పాట్లు ఉండాలని కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ సూచించారు. కలెక్టరేట్‌లో పనిచేసే ఉద్యోగుల పిల్లల సంరక్షణ కోసం ఇక్కడ ఏర్పాటుచేసిన క్రచే సెంటర్, ఫీడింగ్ రూం, ఉద్యోగుల భోజన గదులను బుధవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. కలెక్టరేట్‌లో మహిళా ఉద్యోగుల పిల్లల కోసమే ప్రత్యేకంగా ఈ క్రచే కేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ఈ సందర్భంగా క్రచే సెంటర్‌లో ఉన్న చిన్నారి రిషితను కలెక్టర్ ఎత్తుకున్నారు.

ప్రజాభిప్రాయ సేకరణకు పకడ్బందీ చర్యలు

కలెక్టర్ల వీసీలో రాష్ట్ర బీసీ కమిషన్ చైర్మన్ నిరంజన్

ఖమ్మం, అక్టోబర్ 23: సమగ్ర కులాల స్థితిగతులు తెలుసుకునేందుకే ఉమ్మడి జిల్లాల వారీగా ప్రజాభిప్రాయ సేకరణ కార్యక్రమాన్ని చేపటినట్టు రాష్ట్ర బీసీ కమిషన్ చైర్మన్ నిరంజన్ తెలిపారు. ఈ సర్వే నిర్వహణ కోసం పకడ్బందీ చర్యలు తీసుకోవాలని సూచించారు. సమగ్ర కులాల స్థితిగతుల సర్వేపై ప్రజాభిప్రాయ సేకరణ కోసం తీసుకోవాల్సిన చర్యలపై రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ కమిషనర్ బాల మాయదేవితో కలిసి జిల్లాల కలెక్టర్లతో బుధవారం హైదరాబాద్ నుంచి నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో ఆయన మాట్లాడారు. సమగ్ర కులాల సామాజిక, ఆర్థిక, రాజకీయ విశ్లేషణ జరపాలనే ఉద్దేశంతోనే ప్రభుత్వం ఈ సమగ్ర కులాల సర్వేను చేపట్టిందని వివరించారు. అనంతరం ఖమ్మం నుంచి కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ మాట్లాడుతూ.. ఖమ్మం, భద్రాద్రి జిల్లాలకు సంబంధించి నవంబర్ 5న ఖమ్మం కలెక్టరేట్‌లో నిర్వహించే ప్రజాభిప్రాయ సేకరణకు ఏర్పాట్లు చేస్తున్నామని తెలిపారు.

పాఠశాలల్లో పెండింగ్ పనులు పూర్తిచేయాలి

ఖమ్మం, అక్టోబర్ 23: జిల్లాలో అమ్మ ఆదర్శ పాఠశాలల కమిటీల ద్వారా ప్రభుత్వ పాఠశాలల్లో చేపట్టిన అభివృద్ధి పనులను వేగవంతంగా పూర్తి చేయాలని అదనపు కలెక్టర్ శ్రీజ ఆదేశించారు. అమ్మ ఆదర్శ పాఠశాల పనుల పురోగతిపై సంబంధిత అధికారులతో కలిసి కలెక్టరేట్‌లో బుధవారం నిర్వహించిన సమీక్షలో ఆమె మాట్లాడారు. జిల్లాలో మొత్తం 955 పాఠశాలల్లో అమ్మ ఆదర్శ కమిటీల ద్వారా అభివృద్ధి పనులు చేపట్టగా.. 801 పాఠశాలల్లో పనులు పూర్తయ్యాయని, 147 పాఠశాలల్లో పనులు పురోగతిలో ఉన్నాయని అన్నారు. జిల్లాలో డీఎంఎఫ్‌టీ నిధులు అందుబాటులో ఉన్నాయని, పనుల పురోగతి ప్రకారం వెనువెంటనే బిల్లుల చెల్లింపులను పూర్తి చేస్తామని అన్నారు.

డిప్యూటీ సీఎం ఇలాకాలోనే ఎందుకిలా?

వ్యవసాయ అధికారుల ఆకస్మిక బదిలీలు

ప్రగతిభవన్‌కి వెళ్లి ప్రాథేయపడిన ఏవోలు

మధిర, అక్టోబర్ 23: రాష్ట్ర డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క ఇలాకాలో మండల వ్యవసాయశాఖ అధికారుల ఆకస్మిక బదిలీలు చర్చనీయాంశమైంది. మధిర నియోజకవర్గంలోని మధిర, ఎర్రుపాలెం, బోనకల్లు, చింతకాని, ముదిగొండ మండలాలతో పాటు ఏడీఏ ఆఫీసులో టెక్నికల్ ఏవోలుగా విధులు నిర్వహిస్తున్న వారిపై ఆకస్మికంగా బదిలీ వేటు పడింది. అసలు విషయం ఏమిటంటే ఇటీవల తుపాన్ కారణంగా రైతులు పంటలను నష్టపోయారు. పంటనష్టం సర్వే సమయంలో వ్యవసాయ అధికారులను కాంగ్రెస్ నాయకులు మేము చెప్పింది చేయాలి.. పంటనష్టం జరిగకపోయినా జరిగినట్లు ధ్రువీకరించాలని ఒత్తిడి చేశారు. అయినా వ్యవసాయ అధికారులు వారి మాటలను పట్టించుకోకుండా నష్టపోయిన రైతులను మాత్రమే గుర్తించారు. దీంతో మండల వ్యవసాయ అధికారులను బదిలీ చేస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి. ఈక్రమంలో కొంతమంది అధికారులు తమకు న్యాయం చేయాలంటూ హైదరాబాద్‌లోని ప్రగతిభవనాన్ని ఆశ్రయించినప్పటికీ ఫలితం లేకుండాపోయింది.

ట్రైనీ కలెక్టర్ తల్లికి పెద్దాసుపత్రిలో వైద్య పరీక్షలు

ఖమ్మం సిటీ, అక్టోబర్ 23: ట్రైనీ కలెక్టర్ మృణాల్ తల్లి సంధ్యకు ఖమ్మం పెద్దాసుపత్రి వైద్యులు వైద్య పరీక్షలు నిర్వహించారు. ఆమె ఛాతీలో నొప్పి అనడంతో బుధవారం ఆమెను ఖమ్మం ప్రభుత్వాసుపత్రికి తీసుకెళ్లారు. స్థానిక గుండె వైద్య నిపుణుడు డాక్టర్ సీతారాం, జనరల్ మెడిసిన్ విభాగ ప్రొఫెసర్లు ఆమెకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించారు. అన్నింట్లోనూ సాధారణమని తేలడంతో ఎటువంటి ఇబ్బంది లేదని నిర్ధారించారు. దీంతో ట్రైనీ కలెక్టర్ తన తల్లిని ఇంటికి తీసుకెళ్లారు. మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ ఎల్.కిరణ్‌కుమార్ పాల్గొన్నారు.

'ఏఎన్ఎం శిక్షణకు దరఖాస్తు చేసుకోండి'

రఘునాథపాలెం, అక్టోబర్ 23: ఖమ్మం నగరం టేకులపల్లిలోని దుర్గాబాయి మహిళా శిశు వికాస కేంద్రంలో 2024-25 ఏఎన్ఎం బ్యాచ్‌కు శిక్షణ అందించనున్నట్లు జిల్లా మహిళా ప్రాంగణాధికారి వేల్పుల విజేత బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. వివరాలకు 7660022512 నంబరును సంప్రదించాలని కోరారు.

'యోగా కేంద్రం వద్ద వసతులు కల్పించాలి'

మేయర్‌ను కలిసి విజ్ఞప్తి చేస్తున్న యోగా నిర్వహకులు

ఖమ్మం, అక్టోబర్ 23: ఖమ్మం లకారం పార్కులోని ఎన్టీఆర్ పార్కు వద్ద యోగా కోసం మౌలిక వసతులను కల్పించాలని యోగా నిర్వాహకులు శ్రీలతారెడ్డి, ప్రతిభారెడ్డి, కవిత, వాణి సహ పలువురు యోగా అభ్యాసకులు కోరారు. ఈ మేరకు ఖమ్మంలో కేఎంసీ మేయర్ నీరజ, మంత్రి తుమ్మల తనయుడు యుగంధర్‌ను బుధవారం వారు వేర్వేరుగా కలిసి వినతిపత్రాలు సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఎన్టీఆర్ పార్కు వద్ద సుమారు 60 మంది మహిళలం శ్రీలత ఆధ్వర్యంలో రోజూ యోగా చేస్తున్నామని అన్నారు.

రూరల్ డీసీసీబీలో ఫేక్ రుణాల కలకలం

రంగంలోకి దిగిన డీసీసీబీ ఉన్నతాధికారులు

పద్నాలుగు మంది రుణాలపై ప్రధాన ఫోకస్

విచారణ కొనసాగిస్తున్న డీజీఎం స్థాయి అధికారి

ఖమ్మంరూరల్, అక్టోబర్ 23: జిల్లాకేంద్ర సహకార బ్యాంకు పరిధిలోని ఖమ్మంరూరల్ డీసీసీబీ బ్రాంచిలో ఫేక్ రుణాల వ్యవహారం కలకలం సృష్టిస్తున్నది. దీంతో డీసీసీబీ అధికారుల్లో మరోసారి అలజడి రేగింది. గడిచిన నాలుగేళ్ల క్రితం ఖమ్మం నగరంలోని ఓ డీసీసీబీ బ్రాంచిలో దాదాపు రూ.6 కోట్ల మేర ఫేక్ రుణాలు ఇవ్వడంతో నేటివరకు వాటి సంగతి అతీగతి లేకుండాపోయింది. ఆ వ్యవహారం మరువక ముందే మరోమారు ఖమ్మంరూరల్ బ్రాంచిలో సైతం నకిలీ పట్టాలతో కొందరు బ్యాంకు అధికారులను బురిడి కొట్టించారనే ఆరోపణలు వినపడుతుండగా, బ్యాంకు అధికారుల ప్రమేయంతోనే ఈ వ్యవహారం నడిచిందనేది మరో వాదన. నాలుగేళ్ల క్రితం ఖమ్మంరూరల్ బ్రాంచి మేనేజర్ మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన రైతులకు పంట రుణాలు ఇచ్చారు. మరికొందరికి మార్టిగేజ్ విధానం ద్వారా రుణాలను మంజూరు చేశారు. అనంతరం రూరల్ బ్రాంచి మేనేజర్‌గా మరో అధికారి రావడం, ఈ రుణాలు పూర్తిస్థాయిలో చెల్లించకపోవడం పలు అనుమానాలకు దారితీసింది. తనఖా పెట్టిన భూములకు సంబంధించి అనేక లిటికేషన్లు ఉన్నట్లు విశ్వసనీయ సమాచారం. ఏదేమైనా సదరు రుణాలు పూర్తిస్థాయిలో కట్టలేకపోతుండడంతో బ్రాంచి మేనేజర్ ఈ వ్యవహారాన్ని జిల్లా కేంద్ర బ్యాంకు అధికారులకు లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేశారు. దీంతో స్పందించిన డీసీసీబీ సీఈవో ఈ మొత్తం వ్యవహారంపై విచారణ చేపట్టాలని డీజీఎం సర్వేశ్వరరావుకు విచారణ అధికారిగా బాధ్యతలు అప్పగించారు. దీంతో మంగళ, బుధవారాల్లో సదరు డీజీఎం ఈ వ్యవహారంపై విచారణ కొనసాగిస్తున్నారు. లోతైన విచారణ నిమిత్తం రాష్ట్ర కోఆపరేటివ్ రిజిస్ట్రార్(ఆర్‌సీఎస్)కు ఆదేశించే యోచనలో డీసీసీబీ చైర్మన్, సీఈవోలు ఉన్నట్లు బ్యాంకు వర్గాలు పేర్కొన్నాయి. మొత్తం 14మంది వ్యక్తులు రూ.లక్షల్లో రుణాలు తీసుకున్నట్లు తెలుస్తున్నది. అయితే వీరు ప్రతి సంవత్సరం వడ్డీ, కొంత మొత్తం సైతం చెల్లిస్తున్నట్లు తెలుస్తున్నది. అయితే మార్టిగేజ్‌గా తనఖా పెట్టిన భూములు ఫిజికల్‌గా ఉన్నాయా.. లేదా డబుల్ రిజిస్ట్రేషన్‌కు చెందినవా అనేది తెలియాలి అంటే పూర్తి విచారణ జరగాల్సి ఉంది.

దొంగతనాలకు పాల్పడుతున్న నిందితుల అరెస్టు

సత్తుపల్లిటౌన్, అక్టోబర్ 23: ఆలయాల్లో దొంగతనాలు చేసే ఆంధ్రా ప్రాంతానికి చెందిన కొందరిని అరెస్టు చేశామని సత్తుపల్లి ఏసీపీ అనిశెట్టి రఘు తెలిపారు. బుధవారం సత్తుపల్లి ఏసీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. గత నెల వేంసూరు మండలం వెంకటాపురంలో అంకమ్మ దేవాలయంలో దొంగతనం చేసిన నిందితులను అరెస్టు చేసి వారి వద్ద నుంచి సొత్తును రికవరీ చేసినట్లు పేర్కొన్నారు. మండలంలోని కందుకూరు గ్రామంలో కొంతమంది వ్యక్తులు రెండు బైక్‌లపై అనుమానాస్పదంగా తిరుగుతున్నట్లు సమాచారం రాగా వేంసూరు ఎస్సై తన సిబ్బందితో కలిసి కందుకూరు ఆలయం వద్దకు వెళ్లగా పోలీసులను చూసి వారు పారిపోయేందుకు ప్రయత్నించగా వారిని అదుపులోకి తీసుకొని విచారించారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం పెనుగంచిప్రోలు దేవాలయం సమీపంలోని పరిసర ప్రాంతవాసులకు చెందిన ఎల్లబోయిన గోపి, అద్దంకి గురవయ్య, అద్దంకి శివ, ముంగి రాము, ముంగి కృష్ణ, ఒక బాల నేరస్తుడు చెడు వ్యసనాలకు అలవాటు పడి దొంగతనాలకు పాల్పడుతున్నారు. వారి వద్ద నుంచి నగదు రూ.1.50 లక్షలు, వెండి ముద్దలను స్వాధీన పర్చుకొని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. వీరిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏసీపీ తెలిపారు.

పునాది లేకుండానే పాల సేకరణ కేంద్రం నిర్మాణం

బోనకల్లు, అక్టోబర్ 23: పునాదులు లేకుండానే ఏకంగా పాల సేకరణ కేంద్రం నిర్మాణ పనులను చేపట్టారు. వివరాల్లోకి వెళ్తే.. మండల కేంద్రంలోని విద్యా వనరుల కేంద్రం పక్కనే ఇందిరా డెయిరీ ఆధ్వర్యంలో పాల సేకరణ కేంద్రాన్ని ప్రభుత్వం మంజూరు చేసింది. నియోజకవర్గంలో 5 మండలాల్లో పాల సేకరణ కేంద్రాల ఏర్పాటు కోసం ఒక్కొక్క కేంద్రానికి రూ.7.50 లక్షలు మంజూరు చేసింది. ఈ కేంద్రంలో వివిధ గ్రామాల్లో సేకరించిన పాలను మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన శీతలీకరణ కేంద్రంలో నిల్వ ఉంచేందుకు ఏసీ కంటైనర్లు ఏర్పాటు చేయనున్నారు. ఇందిరా పాల డెయిరీ సొసైటీ ఆధ్వర్యంలో ఈ నిర్మాణాలను చేపడుతున్నారు. మండల విద్యా వనరుల కేంద్రం పక్కనే నిర్మిస్తున్న పాల సేకరణ కేంద్రం పునాదులు తీసి సిమెంట్‌తో పునాదిని పూడ్చి దానిపై నిర్మాణాలు చేపట్టాలి. అదేవిధంగా బేస్‌మెంట్ లెవల్ కూడా ఎత్తుగా నిర్మించాలి. కానీ బేస్‌మెంట్ లెవల్ రోడ్డు కంటే దిగువ భాగంలో నిర్మిస్తున్నారు. ఈ నిర్మాణం చేపడుతున్న ప్రాంతం పూర్తిగా రేగడిభూములు కావడంతో కృంగిపోయే పరిస్థితి నెలకొంది. ఇందిరమ్మ డెయిరీ శాఖకు సంబంధించిన అధికారులే నిర్మాణ విషయంలో ఇందిరా డెయిరీ సొసైటీ నిర్వాహకులకు సూచించారు. అయినప్పటికీ యధావిధిగా నిర్మాణ పనులను చేపడుతున్నారు.

పునాదులు లేకుండా నిర్మిస్తున్న పాల సేకరణ కేంద్రం

ట్రాఫిక్‌కు ఆటంకం కలిగిస్తే చర్యలు

మధిర, అక్టోబర్ 23 : మధిర పట్టణంలోని ప్రధాన రహదారులపై ఉన్న దుకాణ సముదాయాల ఎదుట నియంత్రణ లేకుండా వాహనాలు నిలుపుదల చేసి ట్రాఫిక్‌కు అంతరాయం కలిగిస్తే చర్యలు తీసుకుంటామని మధిర సీఐ డీ.మధు హెచ్చరించారు. బుధవారం టౌన్ పోలీస్‌స్టేషన్ పరిసర ప్రాంతాల్లో అడ్డదిడ్డంగా నిలిపిఉంచిన వాహనదారులతో మాట్లాడారు. మరోసారి ఇటువంటి పరిస్థితులు కనిపిస్తే చర్యలు తీసుకుంటామన్నారు.

చల్లపల్లి రాధమ్మ మృతిపట్ల సంతాపం

ఖమ్మం రూరల్, అక్టోబర్ 23: ప్రముఖ వ్యాపారి చల్లపల్లి శ్రీనివాస్ మాతృమూర్తి రాధమ్మ ఇటీవల మృతిచెందిన సంగతి తెలిసిందే. బుధవారం ఖమ్మం ఎంపీ రఘురామరెడ్డి, సీపీఎం జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు పెద్దతండా పంచాయతీలో ఉన్న శ్రీనివాస్ ఇంటికెళ్లి రాధమ్మ చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. కుటుంబసభ్యులకు సానుభూతి తెలిపారు. నివాళి అర్పించిన వారిలో ఆయా పార్టీల నాయకులు చంద్రశేఖర్, నరేందర్, శ్రీనివాస్, సోమయ్య, శ్రీకాంత్, వెంకటేశ్వరరావు ఉన్నారు.

పెద్దాసుపత్రిలో సీటీ స్కాన్ సేవలు షురూ

ఖమ్మం సిటీ, అక్టోబర్ 23: జిల్లా సార్వజనీన ఆసుపత్రిలో సీటీ స్కాన్ సేవలను పునరుద్ధరించారు. స్థానిక మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ ఎల్.కిరణ్‌కుమార్ సమస్యను కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. తక్షణమే స్పందించిన ఆయన.. సీటీ స్కాన్ యంత్రం మరమ్మతులను పూర్తి చేయించారు. దీంతో బుధవారం నుంచి దవాఖానలోనే సీటీ స్కాన్ సేవలు అందుబాటులోకి వచ్చాయని వైద్యాధికారులు తెలిపారు. కాగా, పెద్దాసుపత్రి ప్రాంగణంలోని క్యాంటీన్‌ను కేఎంసీ మేయర్ పునుకొల్లు నీరజ, కమిషనర్ అభిషేక్, మెడికల్ సూపరింటెండెంట్ కిరణ్‌కుమార్ కలిసి ప్రారంభించారు.

సీపీఐ సీనియర్ నేత వెంకట్రామనర్సయ్య మృతి

ఖమ్మం రూరల్, అక్టోబర్ 23 : మండల పరిధిలోని కామంచికల్ గ్రామానికి చెందిన సీపీఐ సీనియర్ నాయకుడు మేదరమెట్ల వెంకట్రామనర్సయ్య(84) అనారోగ్యంతో బుధవారం మృతిచెందారు. విషయం తెలుసుకున్న సీపీఐ సీనియర్ నాయకుడు, మాజీ ఎమ్మెల్యే, శాసనమండలి సభ్యుడు పువ్వాడ నాగేశ్వరరావు కామంచికల్ గ్రామానికి వెళ్లి వెంకట్రామనర్సయ్య భౌతికకాయాన్ని సందర్శించి నివాళి అర్పించారు.

ఆడపిల్లల రక్షణ ప్రతిఒక్కరి బాధ్యత

మధిర రూరల్, అక్టోబర్ 23: ఆడపిల్లల రక్షణ ప్రతిఒక్కరి బాధ్యత అని జిల్లా బాలల పరిరక్షణ విభాగం సామాజిక కార్యకర్త నంద్యాల హరిప్రసాద్ అన్నారు. మండల పరిధిలోని దెందుకూరు హరిజనవాడ ప్రాథమిక పాఠశాలనందు ఆడపిల్లల సంరక్షణపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు.

విద్యుత్‌శాఖ రూరల్ సెక్షన్ ఏఈగా మైథిలి

మధిర రూరల్, అక్టోబర్ 23 : విద్యుత్‌శాఖ మధిర రూరల్ సెక్షన్ అసిస్టెంట్ ఇంజినీర్‌గా ఎస్.మైథిలి బాధ్యతలు స్వీకరిస్తూ మధిర సబ్ డివిజన్ కార్యాలయంలో ఏడీఈ ఎం.అనురాధకు బుధవారం జాయినింగ్ రిపోర్టు అందజేశారు. మహబూబాబాద్ సర్కిల్ నుంచి బదిలీపై మధిర రూరల్ సెక్షన్ ఏఈగా బాధ్యతలు స్వీకరించిన మైథిలిని విద్యుత్‌శాఖ అధికారులు అభినందించారు.

ఇసుక ట్రాక్టర్లు పట్టివేత

తిరుమలాయపాలెం, అక్టోబర్ 23: మండలంలోని కాకరవాయి సమీపంలో పాలేరు వాగు నుంచి అక్రమంగా ఇసుకను తరలిస్తున్న ఆరు ట్రాక్టర్లను బుధవారం స్థానిక ఎస్ఐ జగదీష్ పట్టుకున్నారు. ఇసుక ట్రాక్టర్లను తహసీల్దార్‌కు అప్పగించనున్నట్లు పోలీసులు తెలిపారు.

స్వాతంత్ర్య సమరయోధుడు మృతి

ఎర్రుపాలెం, అక్టోబర్ 23 : మండల పరిధిలోని తక్కెళ్లపాడు గ్రామానికి చెందిన స్వాతంత్ర్య సమరయోధుడు అయిలూరి రామిరెడ్డి(85) గత కొన్ని రోజులుగా అనారోగ్యంతో బాధపడుతూ మంగళవారం రాత్రి మృతిచెందాడు. మృతుడికి భార్య, ముగ్గురు కుమార్తెలు ఉన్నారు. రామిరెడ్డి మృతికి పలువురు రాజకీయ నాయకులు, స్వాతంత్ర్య సమరయోధులు సంతాపం తెలిపారు.

'ఉద్యోగుల సమారాధనను సక్సెస్ చేయండి'

ఖమ్మం, అక్టోబర్ 23: నవంబర్ నెల 3న ఖమ్మంలో నిర్వహించనున్న సకల ఉద్యోగుల ఆత్మీయ సమ్మేళన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని టీజీఈజేఏసీ నాయకులు, ఆహ్వాన కమిటీ సభ్యులు కోరారు. టీఎన్‌జీవోస్ జిల్లా కార్యాలయంలో బుధవారం వారు మాట్లాడి కార్యక్రమ పోస్టర్ ఆవిష్కరించారు.

నేడు, రేపు మహిళా డిగ్రీ కళాశాలకు న్యాక్ బృందం

ఖమ్మం ఎడ్యుకేషన్, అక్టోబర్ 23: ఈ నెల 24, 25 తేదీల్లో ఖమ్మంలోని ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలను న్యాక్ బృందం సందర్శించనున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ పద్మావతి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు.

ఏడు ఇసుక ట్రాక్టర్లు పట్టివేత

రఘునాథపాలెం, అక్టోబర్ 23: అనుమతుల్లేకుండా ఇసుక తరలిస్తున్న ఏడు ట్రాక్టర్లను ఖానాపురం ఖానాపురం హవేలీ పోలీసులు బుధవారం పట్టుకున్నారు. చింతకాని మండలం చిన్నమండవ గ్రామం వద్ద మున్నేరు రేవులోకి అక్రమంగా ప్రవేశించి అనుమతి లేకుండా ఇసుకను ట్రాక్టర్లలోకి లోడ్ చేసి తీసుకొచ్చి ఎస్‌బీఐటీ కళాశాల వద్ద భవన నిర్మాణాలకు విక్రయిస్తుండగా పట్టుకున్నట్లు సీఐ భానుప్రకాశ్ తెలిపారు. ఏఎస్ఐ వెంకటరెడ్డి ఫిర్యాదు మేరకు ఇసుక ట్రాక్టర్ యజమానులు, డ్రైవర్లపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

గల్లంతైన వ్యక్తి మృతదేహం లభ్యం

ఎర్రుపాలెం, అక్టోబర్ 23 : మండల పరిధిలోని మామునూరు గ్రామానికి చెందిన దంతాల వెంకటేశ్వరరావు(30) రాజులదేవరపాడు వద్ద కట్టలేరులో మంగళవారం చేపలు పట్టేందుకు వెళ్లి ప్రమాదవశాత్తు వరద ఉధృతికి కొట్టుకుపోయి గల్లంతైన విషయం విదితమే. తండ్రి అప్పారావు ఫిర్యాదు మేరకు ఎస్సై పీ.వెంకటేష్ రెస్క్యూటీంను పిలిపించి గాలింపు చర్యలు చేపట్టడంతో బుధవారం బనిగండ్లపాడు సమీపంలో వెంకటేశ్వరరావు మృతదేహం లభ్యమైంది. మృతుడికి భార్య, కుమారుడు ఉన్నారు. పోలీసులు కేసు నమోదు చేశారు.

ముగిసిన 'ఫార్మా' కౌన్సెలింగ్

ఖమ్మం ఎడ్యుకేషన్, అక్టోబర్ 23: ఖమ్మంలోని ఎస్ఆర్‌బీజీఎన్ఆర్ కళాశాల ఆడిటోరియంలో మూడు రోజులుగా జరుగుతున్న బీ ఫార్మసీ, ఫార్మా డీ ప్రవేశాల కౌన్సెలింగ్ ప్రక్రియ బుధవారంతో ముగిసినట్లు కళాశాల ప్రిన్సిపాల్ జాకీరుల్లా తెలిపారు. చివరి రోజు 197 మంది విద్యార్థులకు 185 మంది హాజరైనట్లు చెప్పారు.

రైతు వేదికలను సందర్శించిన శిక్షణ ఐఏఎస్‌లు

చిన్నారులతో శిక్షణ ఐఏఎస్‌లు

కారేపల్లి, అక్టోబర్ 23: కారేపల్లి మండలంలో పర్యటిస్తున్న శిక్షణ ఏఐఎస్, ఐపీఎస్‌లు బుధవారం రైతువేదికలు, అంగన్‌వాడీ కేంద్రాలు, హెల్త్ సబ్‌సెంటర్లను సందర్శించారు. రైతువేదికలో ఏవో బీ.అశోక్‌కుమార్‌ను రైతులకు అందుతున్న సేవలు, పంటల వివరాలు అడిగి తెలుసుకున్నారు. శిక్షణ ఐఏఎస్‌లు తేజస్విని, తబాని, అనితామీనా, వైభవ్‌మీనా, అల్టామాష్ ఘాజీ, విపుల్‌సింగ్ పలు ప్రభుత్వ కార్యాలయాలను సందర్శిస్తున్నారు. ఉసిరికాయలపల్లిలో సింగరేణి కాలరీస్ ఆధ్వర్యంలో నడుస్తున్న సోలార్ ప్లాంట్‌ను ట్రైనీ ఐఏఎస్‌లు పరిశీలించి ఉత్పత్తి సామర్థ్యం, పంపిణీ వివరాలను అడిగి తెలుసుకున్నారు. అంగన్‌వాడీ సెంటర్‌లో చిన్నారులతో సరదాగా గడిపారు.

కుటుంబ సమేతంగా శ్రీవారిని దర్శించుకున్న సండ్ర

శ్రీవారిని దర్శించుకున్న మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య, కుటుంబసభ్యులు

సత్తుపల్లిటౌన్, అక్టోబర్ 23: తిరుమల శ్రీవారిని సత్తుపల్లి మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య కుటుంబ సమేతంగా బుధవారం దర్శించుకున్నారు. ఇటీవల సండ్ర ప్రథమ కుమారుడు భార్గవ్, సాయి చద్వితల వివాహం జరుగ్గా నూతన వధూవరులతో కలిసి శ్రీవారిని దర్శించుకొని మొక్కులు చెల్లించుకున్నారు.

సేంద్రియ ఎరువులతో భూసార సంరక్షణ: డీసీవో

సదస్సులో మాట్లాడుతున్న డీసీవో గంగాధర్

ఖమ్మం వ్యవసాయం, అక్టోబర్ 23: సేంద్రియ ఎరువులతోనే భూసార సంరక్షణ సాధ్యపడుతుందని జిల్లా సహకార అధికారి (డీసీవో) గంగాధర్ పేర్కొన్నారు. సేంద్రియ ఎరువుల వినియోగంపై స్పిక్, గ్రీన్‌స్టార్ ఫెర్టిలైజర్స్ కంపెనీ ఆధ్వర్యంలో ఖమ్మంలో బుధవారం ఏర్పాటుచేసిన సదస్సుల్లో భద్రాద్రి డీసీవో ఖుర్షీద్‌తో కలిసి ఖమ్మం డీసీవో గంగాధర్ మాట్లాడారు. సేంద్రియ ఎరువులే రైతులకు లాభాదాయకమని సూచించారు. మార్క్‌ఫెడ్ మేనేజర్ సునీత, స్పిక్ కంపెనీ అధికారులు పాల్గొన్నారు.

పోలీసు శిక్షణ కేంద్రంలో మాక్ డ్రిల్ ప్రాక్టీస్

ఖమ్మం, అక్టోబర్ 23: ఏవైనా అవాంఛనీయ పరిణామాలు, హింసాత్మక ఘటనలు చోటుచేసుకున్న సమయంలో సమయస్ఫూర్తితో వ్యవహరించాలని సీపీ సునీల్ దత్ సూచించారు. అలాంటి ఘటన సమయంలో అల్లరిమూకలను చెదరగొట్టడానికి సమాయత్తమయ్యే ప్రక్రియలో భాగంగా మాబ్ ఆపరేషన్ మాక్ డ్రిల్ కార్యక్రమాన్ని ఖమ్మంలోని పోలీసు శిక్షణ కేంద్రంలో బుధవారం నిర్వహించారు.

హెచ్‌సీ కుటుంబానికి కానిస్టేబుళ్ల ఆర్థికసాయం

ఇటీవల మరణించిన ఓ హెడ్ కానిస్టేబుల్ (హెచ్‌సీ) కుటుంబానికి సహచర కానిస్టేబుళ్లు ఆర్థిక సాయం అందించారు. సెప్టెంబర్ 21న కొణిజర్ల పోలీస్ స్టేషన్‌లో విధి నిర్వహణలో ఉన్న హెడ్ కానిస్టేబుల్ లోకేశ్ గుండెపోటుతో మరణించిన విషయం విధితమే. ఉమ్మడి జిల్లాకు చెందిన తోటి బ్యాచ్ పోలీస్ సిబ్బంది తమవంతు సహాయంగా రూ.2 లక్షలను ఖమ్మంలో సీపీ ద్వారా మృతుడి కుటుంబానికి అందజేశారు.

పటాకుల వ్యాపారులు నిబంధనలు పాటించాలి

ఖమ్మం, అక్టోబర్ 23: దీపావళి సందర్భంగా ఏర్పాటుచేసే బాణసంచా దుకాణాల్లో వ్యాపారులు ప్రభుత్వ నియమ నిబంధనలను కచ్చితంగా పాటించాలని అదనపు డీసీపీ (అడ్మిన్) నరేశ్‌కుమార్ సూచించారు. సీపీ సునీల్‌దత్ ఆదేశాల మేరకు ఏడీసీపీ ప్రసాద్‌రావు, టౌన్ ఏసీపీ రమణమూర్తి, విద్యుత్ శాఖ డీఈతో కలిసి పోలీస్ కాన్ఫరెన్స్ హాల్లో బుధవారం నిర్వహించిన పటాకుల దుకాణదారుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పోలీస్, మున్సిపల్, అగ్నిమాపక, విద్యుత్ శాఖలు నిర్దేశించిన ప్రదేశంలో మాత్రమే వాటి అనుమతితో దుకాణాలను ఏర్పాటు చేసుకోవాలని సూచించారు.

ఇద్దరు విద్యార్థినులకు గాయాలు

పెనుబల్లి, అక్టోబర్ 23: కోతుల దాడి నుంచి తప్పించుకునే ప్రయత్నంలో ఇద్దరు విద్యార్థినులకు తీవ్రగాయాలైన ఘటన బుధవారం మండలంలో చోటు చేసుకుంది. మండలంలోని టేకులపల్లి మోడల్ స్కూల్‌లో చదువుతున్న విద్యార్థిని చరిత స్టడీ అవర్స్ ముగించుకొని హాస్టల్‌లో పైఅంతస్తుకు వెళ్తుండగా కోతులు ఎదురొచ్చాయి. భయంతో ఒక్కసారిగా మెట్లపై నుంచి జారి పడిపోయింది. కాపాడేందుకు ప్రయత్నించిన వైష్ణవిపై కూడా కోతులు దాడి చేయడంతో ఆమె కూడా జారి పడిపోవడంతో గాయాలయ్యాయి. విద్యార్థినులను పెనుబల్లి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

మెడికల్ సీటు సాధించిన విద్యార్థికి ఆర్థికసాయం

సత్తుపల్లిటౌన్, అక్టోబర్ 23: గుడిపాడుకు చెందిన శివభార్గవి వరంగల్‌లోని ప్రతిభ కళాశాలలో ఎంబీబీఎస్ సీటు సాధించడం పట్ల సత్తుపల్లి జేవీఆర్ డిగ్రీ కళాశాల పూర్వ విద్యార్థుల తరపున బుధవారం రూ.10 వేలు ఆర్థికసాయం అందజేశారు.

15వ బెటాలియన్‌లో వ్యాసరచన పోటీలు

సత్తుపల్లి, అక్టోబర్ 23: మండలంలోని గంగారం 15వ ప్రత్యేక పోలీస్ బెటాలియన్ వారి ఆధ్వర్యంలో పోలీస్ ఫ్లాగ్ డే-2024 దినోత్సవాల్లో భాగంగా బెటాలియన్‌లో బుధవారం వ్యాసరచన పోటీలు నిర్వహించారు. బెటాలియన్ సిబ్బంది, అధికారులు వ్యాసరచన పోటీల్లో పాల్గొన్నారు. బెటాలియన్ కమాండెంట్ పీ.జే.పీ.సీ. చటర్జీ మాట్లాడుతూ.. ప్రతి సంవత్సరం పోలీస్ అమరవీరుల దినోత్సవం సందర్భంగా సిబ్బందికి, అధికారులకు వ్యాసరచన పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

ఏఈవోలు మాస్ లీవ్

పెనుబల్లి, అక్టోబర్ 23: కాంగ్రెస్ ప్రభుత్వం 165 మందిని సస్పెన్షన్ చేయడాన్ని నిరసిస్తూ పెనుబల్లి, కల్లూరు మండలాలతో పాటు, డివిజన్‌లోని అన్ని మండలాల ఏఈవోలు ఏడీఈ శ్రీనివాసరెడ్డికి మాస్‌లీవ్ పత్రాలు అందజేశారు. అనంతరం సస్పెండ్ చేసిన ఏఈవోలకు మద్దతుగా చలో హైదరాబాద్ తరలివెళ్లారు. వారికి మళ్లీ నియామక ఉత్తర్వులు అందించాకే ఉద్యోగాల్లో జాయిన్ అవుతామని స్పష్టం చేశారు.

అన్నం ఫౌండేషన్‌కు 10 క్వింటాళ్ల బియ్యం వితరణ

రఘునాథపాలెం, అక్టోబర్ 23: ఖమ్మం నగరానికి చెందిన రోటరీ వాసవీ క్లబ్ సభ్యులు కేసా సత్యం.. అన్నం ఫౌండేషన్‌కు 10 క్వింటాళ్ల బియ్యాన్ని అందజేశారు.

ఆన్‌లైన్ మోసాల నుంచి కాపాడుకోవాలి: ఏసీపీ

ఖమ్మం ఎడ్యుకేషన్, అక్టోబర్23: ఆధునిక డిజిటల్ ప్రపంచంలో ఆన్‌లైన్ మోసాల నుంచి ఎవరిని వారు కాపాడుకోవాలని సైబర్ సెల్ ఏసీపీ ఫణీందర్‌శర్మ సూచించారు. 'సైబర్ మోసాలు' అనే అంశంపై సాహితీ కళాశాలలో బుధవారం నిర్వహించిన సదస్సులో ఆయన మాట్లాడారు. తిరుపతయ్య, నాగేశ్వరరావు, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

అథ్లెటిక్స్ పోటీల్లో కేఎండీసీ ప్రతిభ

ఖమ్మం సిటీ, అక్టోబర్ 23: ఇటీవల గుంటూరులో జరిగిన సౌత్‌జోన్ అథ్లెటిక్స్ పోటీల్లో ఖమ్మంలోని కవితా మెమోరియల్ డిగ్రీ కళాశాల (అటానమస్)కు చెందిన అథ్లెట్లు జాతీయస్థాయిలో సత్తా చాటారు. జూనియర్ బాలుర విభాగంలో కళాశాలలో బీఏ ద్వితీయ సంవత్సర విద్యార్థి గోపీచంద్ 400 మీటర్లలో 4.100 రిలే పరుగులతో రజతం పతకం సాధించాడు. అదేవిధంగా ఎస్‌కే ఆఫ్రిన్ అనే విద్యార్థిని మిడ్ రిలే విభాగంలో కాంస్య పతకం కైవసం చేసుకుంది.

'ఆ భూమి కోసం పోరాడతాం..'

సీపీఎం మండల కార్యదర్శి పురుషోత్తం

ముదిగొండ, అక్టోబర్ 23 : ఆక్రమణకు గురైన ప్రభుత్వ భూమిని వెంటనే అధికారులు స్వాధీనం చేసుకునే వరకు పోరాడతామని సీపీఎం మండల కార్యదర్శి బట్టు పురుషోత్తం అన్నారు. ముదిగొండలోని ఆ పార్టీ కార్యాలయంలో బుధవారం ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ వెంకటాపురం రెవెన్యూలోని 145 సర్వేలో 1.20 ఎకరాల భూమి ఆక్రమణకు గురైన విషయం వాస్తవమేనన్నారు. 50 సంవత్సరాలుగా రెవెన్యూ రికార్డుల్లో ప్రభుత్వ భూమిగానే ఉన్నట్లు తెలిపారు. అధికారులు స్పందించి ఆ భూమిని సర్వే చేసి స్వాధీనం చేసుకోవాలని కోరారు.

ప్రకటన

ఇందుమూలముగా నాక్లయింటు అయిన శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్, సత్తుపల్లి బ్రాంచ్ వారు ఇచ్చిన బొగట్టా ప్రకారం యావన్మందికి తెలుపునది. ఈ క్రింది షెడ్యూలు చూపిన స్థిరాస్తిని రిజిస్టర్ తనఖా చేయించుకొని **పూకే రంజిత్ కుమార్**, S/O. **నాగేశ్వరరావు, వయస్సు** : 32 సం||లు, **వృత్తి** : వ్యవసాయం, **నివాసం** : జగన్నాధపురం గ్రామం, సత్తుపల్లి మండలం, ఖమ్మం జిల్లా గారికి ఋణం ఇచ్చుటకు నిర్ణయించుకున్నారు. కావున సదరు వ్యవహారమునకు సంబంధించి సదరు షెడ్యూల్ స్థిరాస్తిపై ఎవరికైననూ ఎటువంటి జప్తులు చార్జీలు, క్లైయిములు, తనఖాలు అగ్రిమెంట్‌లు, కోర్టు వివాదములు తదితర అభ్యంతరములు ఉన్నయెడల నేటి నుండి 5 రోజులలో ఈ క్రింద చూపిన చిరునామాకు వ్రాతపూర్వకముగా తెలియజేయగలరు. తదుపరి వచ్చు అభ్యంతరములకు నా క్లయింటు బాధ్యులు కారు.

షెడ్యూలు ఆస్తి : ఖమ్మం జిల్లా రిజిస్ట్రారు, జిల్లా పరిషత్ ఖమ్మం, కల్లూరు సబ్ రిజిస్ట్రార్ వారి ఆఫీసు పరిధిలోని కల్లూరు మండలం, నారాయణపురం గ్రామపంచాయితీ, నారాయణపురం గ్రామ రెవిన్యూ రికార్డు దాఖలా సర్వే నెం. 112/ఆ/4/2, 112/ఈ/1/1, 112/ఈ/2/1, 112/ఇ/1, 112/ఉ/1 మింజుమలె ప్లాట్ నెం. 41 దాఖలా విస్తీర్ణం. 167-00 చ.గజములకు సమానమగు 140.28 చ.మీటర్లు, **డాక్యుమెంట్ నెం.: 2562/2019** గల ఖాళీ నివేశన స్థలమునకు హద్దులు : **తూర్పు** : నాచే ఏర్పాటు చేయబడిన 30 అడుగుల వెడల్పు గల రోడ్డు, **పడమర** : 26వ నెంబరు గల ప్లాట్, **ఉత్తరం** : 42వ నెంబరు గల ప్లాట్, **దక్షిణం** : 40వ నెంబరు గల ప్లాట్.

జి.హరేందర్ రెడ్డి
అడ్వకేట్, ఖమ్మం.
సెల్ : 9848022542

ప్రకటన

ఇందుమూలముగా నాక్లయింటు అయిన శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్, **కల్లూరు బ్రాంచ్** వారు ఇచ్చిన బొగట్టా ప్రకారం యావన్మందికి తెలుపునది. ఈ క్రింది షెడ్యూలు చూపిన స్థిరాస్తిని రిజిస్టర్ తనఖా చేయించుకొని **ఇజ్జగాని రాము**, S/o. **తిరుపతయ్య, వయస్సు** :25సం||లు, **వృత్తి** : వ్యవసాయం, **నివాసం**: పడమరలోకవరం గ్రామం, కల్లూరు మండలం, ఖమ్మం జిల్లా గారికి ఋణం ఇచ్చుటకు నిర్ణయించుకున్నారు.కావున సదరు వ్యవహారమునకు సంబంధించి సదరు షెడ్యూల్ స్థిరాస్తిపై ఎవరికైనను ఎటువంటి జప్తులు చార్జీలు, క్లైయిములు, తనఖాలు అగ్రిమెంట్‌లు, కోర్టు వివాదములు తదితర అభ్యంతరములు ఉన్నయెడల నేటి నుండి 3 రోజులలో ఈ క్రింద చూపిన చిరునామాకు వ్రాతపూర్వకముగా తెలియజేయగలరు. తదుపరి వచ్చు అభ్యంతర ములకు నా క్లయింటు బాధ్యులు కారు.

షెడ్యూలు ఆస్తి : ఖమ్మం జిల్లా రిజిస్ట్రారు, జిల్లా పరిషత్, ఖమ్మం, కల్లూరు సబ్ రిజిస్ట్రారు వారి ఆఫీసు పరిధిలోని కల్లూరు మండలం, కల్లూరు గ్రామపంచాయితీ, కల్లూరు గ్రామరెవిన్యూ రికార్డు దాఖలా సర్వేనెం.493/ఆ/ఇ మింజుమలే, పుల్లయ్యబంజర పోవు రోడ్ నందు వెల్లంకి ఎస్టేట్ నందు 3-187/1/2 నెంబరు గల ఇంటికి సమీపమున గల ప్లాట్ నెం.142వ, **డాక్యుమెంట్ నెం: 2277/2023**, విస్తీర్ణము : 169.88 చ||గ||లకు సమానమగు 142.69 చ||మీ||ల ఖాళీ నివేశన స్థలమునకు హద్దులు : **తూర్పు**: బొడ్డు వీరయ్య గారి స్థలము, **పడమర** : 30 లింకుల వెడల్పు గల రోడ్డు, **ఉత్తరం**: 141వ నెంబరు ప్లాటులో పార్ట్, **దక్షిణము**: 143వ నెంబరు ప్లాటు.

పలివెల గణేష్ బాబు
అడ్వకేట్, కొత్తగూడెం.సెల్ : 9849246278

ప్రకటన

ఇందుమూలముగా నాక్లయింటు అయిన శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్, సత్తుపల్లి బ్రాంచ్ వారు ఇచ్చిన బొగట్టా ప్రకారం యావన్మందికి తెలుపునది. ఈ క్రింది షెడ్యూలు చూపిన స్థిరాస్తిని రిజిస్టర్ తనఖా చేయించుకొని **సోయం కృష్ణవేణి**, W/O. **పూకే రంజిత్ కుమార్, వయస్సు** : 35 సం||లు, **వృత్తి** : గృహిణి, **నివాసం** : జగన్నాధపురం గ్రామం, సత్తుపల్లి మండలం, ఖమ్మం జిల్లా గారికి ఋణం ఇచ్చుటకు నిర్ణయించుకున్నారు. కావున సదరు వ్యవహారమునకు సంబంధించి సదరు షెడ్యూల్ స్థిరాస్తిపై ఎవరికైననూ ఎటువంటి జప్తులు చార్జీలు, క్లైయిములు, తనఖాలు అగ్రిమెంట్‌లు, కోర్టు వివాదములు తదితర అభ్యంతరములు ఉన్నయెడల నేటి నుండి 5 రోజులలో ఈ క్రింద చూపిన చిరునామాకు వ్రాతపూర్వకముగా తెలియజేయగలరు. తదుపరి వచ్చు అభ్యంతరములకు నా క్లయింటు బాధ్యులు కారు.

షెడ్యూలు ఆస్తి : ఖమ్మం జిల్లా రిజిస్ట్రారు, జిల్లా పరిషత్ ఖమ్మం, కల్లూరు సబ్ రిజిస్ట్రార్ వారి ఆఫీసు పరిధిలోని కల్లూరు మండలం, నారాయణపురం గ్రామపంచాయితీ, నారాయణపురం గ్రామ రెవిన్యూ రికార్డు దాఖలా సర్వే నెం. 112/ఆ/4/2, 112/ఈ/1/1, 112/ఈ/2/1, 112/ఇ/1, 112/ఉ/1 మింజుమలె ప్లాట్ నెం. 42 దాఖలా విస్తీర్ణం. 167-00 చ.గజములకు సమానమగు 140.28 చ.మీటర్లు, **డాక్యుమెంట్ నెం.: 2565/2019** గల ఖాళీ నివేశన స్థలమునకు హద్దులు : **తూర్పు** : నాచే ఏర్పాటు చేయబడిన 30 అడుగుల వెడల్పు గల రోడ్డు, **పడమర** : 27వ నెంబరు గల ప్లాట్, **ఉత్తరం** : 43వ నెంబరు గల ప్లాట్, **దక్షిణం** : 41వ నెంబరు గల ప్లాట్.

జి.హరేందర్ రెడ్డి
అడ్వకేట్, ఖమ్మం.
సెల్ : 9848022542

మన రాష్ట్రం మన పత్రిక
నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్ Classifieds
PLOT FOR SALE
★గజం: 2,500/- నార్కెట్‌పల్లి దగ్గర గేటెడ్ కమ్యూనిటీ వెంచర్‌లో స్విమ్మింగ్ పూల్, కాటేజీ, 30 పండ్ల మొక్కలు, 30 ఎర్రచందనం మొక్కలతో 5 & 10 గుంటల ప్లాట్స్ అమ్మబడును. దసరా ఆఫర్ 10 గ్రా. గోల్డ్ కలదు. 7569587521.
NT-338783

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లైయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

మన రాష్ట్రం మన పత్రిక
నమస్తే తెలంగాణ
నమస్తే తెలంగాణ దినపత్రికలో
చందా కొరకై మరియు పత్రికా పంపిణీలో
ఏమైనా సమస్యలు ఉంటే సంప్రదించగలరు
సెల్ : 9182777073
నమస్తే తెలంగాణ దినపత్రికలో అన్ని రకాల
ప్రకటనలు (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు సంప్రదించగలరు
సెల్ : 9182777616